# అప్పారావు -- ప్రేమలేఖ

— కె. ఎల్. ఎన్. మూర్తి.

"అప్పారావ్! ఒరేయ్ అప్పారావ్!"

ఏదో లోకంలో విహరిస్తున్న అప్పారావు ఈ అరుపులతో ఈలోకంలో కొచ్చిపడ్డాడు. ఈ సమయంలో ఎవరా వచ్చింది అని తలుపుతీసి చూస్తేఎదురుగా రామారావుకనపడ్డాడు.

"ఏరా అప్పారావు! పగటి కలలు కంటున్నావా? ఎంతసేపని తలుపు కొట్టాలి.?

"పగటి కలలులేవు ఏమీ లేదుగాని ఏమిటి ఈసమయంలో వూడిపడ్డావు"

"ఏం లేదురా! ఇంట్లో ఏం తోచక"

"అదేమిట్రోయ్! పెళ్ళాం పిల్లలున్న వాడివి నీకు తోచక పోవటమేమిటి" ప్రశ్నార్థకంగా అడిగాడు అప్పారావు.

"అదిసరే! ఏమిటి ఇందాక అంతసేపు తలుపు కొట్టినా తియ్యలేదు? నిద్రపోతున్నావా"

"అబ్బె అదేం లేదురా! మరి..." అంటూ నీళ్ళు నమలసాగాడు అప్పారావు.

"ఏమిటి నీళ్ళు నములుతున్నావు?"

"ఎవరికీ చెప్పనంటే చెపుతాను."

"అబ్బ! ఎవరికి చెప్పనులేరా. అసలింతకీ విషయమేమిటి"

"ఎవరికి చెప్పవుకదా?" అంటూ మళ్ళి అడగబోయి

"అబ్బె! ఏంలేదురా! మరి......"అంటూ సిగ్గుపడసాగాడు అప్పారావు.

"ఆ సిగ్గేమిటిరా మధ్యలో! విషయం చెప్పరాబాబు."

"అదేరా! మన 'అజంతా శిల్పం' లేదు ఇందిర ప్రేమలేఖ రాసిందిరా"

"ఏమిట? ప్రేమలేఖా? నీకా?" అంటూ ఆశ్చర్యపోయాడు రామారావు.

"లేకపోతే నీకనుకున్నావా" అంటూ కోపం ప్రకటించాడు అప్పారావు.

"అసలింతకీ ఏం రాశిందిరా?"

"రేపు ఆదివారం సాయంత్రం అయిదింటికి గాంధి పార్కులో కలవమంది"

"ఒరేయ్! అప్పారావు! మొత్తానికి చాన్సు కొట్టావురా.

"వస్తారా! గుడ్‌లక్" అంటూ బయటికి నడిచాడు రామారావు ఇంట్లోకి సరుకులు తేవాలన్న విషయం జ్ఞాపకంవచ్చి.

◆ ◆ ◆

ఆ మర్నాడు సాయంత్రం .............
సరిగా పావుతక్కువ అయిదింటికి టిఫ్‌టాప్

గా తయారయి పార్కుకి నడిచాడు అప్పారావు.

ఎండాకాలం అవటం వలన జనం ఎక్కువగానే వున్నారు. 'అసలు ఈపార్కులో జనం బాగా వుంటారని తెలిసిగూడా ఈపార్కులో కలవమని రాశిందేవిటా' అని ఆలోచిస్తూ ఒక మూలనున్న బెంచీవేపు నడిచాడు అప్పారావు. టయిం చూసుకుంటే అయిదు గంటలకి ఇంకా అయిదునిమిషాలుంది.

ఇంతలో "హల్లో అప్పారావ్ గారు!" అంటూ వినబడే టప్పటికి 'ఎవరా' అని అనుకుంటూ చచ్చాంరాదేవుడా! అనుకున్నాడు అప్పారావు ఎదురుగా వస్తున్న గుర్నాధాన్ని చూస్తూ. గుర్నాధంఅప్పారావుసహోద్యోగి.

"ఏం సార్! అప్పారావుగారు! పార్కుకి వచ్చారు! సినిమా ప్రోగ్రాంఏంలేదా'' అంటూ అప్పారావు ప్రక్కనే చతికిలపడ్డాడు గుర్నాధం.

'ఈసమయంలో వీడెందు కొచ్చాడా' అని లోలోపల తిట్టుకుంటూనే'' లేదండి వూరికే వచ్చాను అంటూ సమాధాన మిచ్చాడు అప్పారావు.

"మే నెల రాకుండానే ఎండలు బాగా ముదిరి పోయాయి ఏమంటారు అప్పారావు గారు?''

''ఆఁ! అహఁ! అవునండి" అంటూ ఒక నవ్వు విసిరాడు అప్పారావు. టయిం చూసుకుంటే అయిదు గంటలయిపోయింది' బహుశ ఇందిర వస్తూ వుండవచ్చు ఈశనిగాడు ఎప్పుడు కదులుతాడో గదా' అంటూ లోలోపల తిట్టుకుంటున్నాడు అప్పారావు. కాని గుర్నాధం వ్యవహారించూస్తే ఇప్పుడప్పుడే కదిలేలాలేడు.

పోనీ ఇందిరను బయటే కలుసుకొని ఈ గుర్నాధంగాడు చూడకుండా అటుప్రక్క గేటులోంచి లోపలికొస్తే' అని ఆలోచిస్తూ అప్పారావు నెమ్మదిగా లేచాడు.

''వస్తాను గుర్నాధంగారు కొద్దిగాపనుంది" అంటూ వెళ్ళబోయాడు అప్పారావు.

"ఆఁ! మర్చేపోయాను అప్పారావుగారు! అడుగుతున్నానని ఏమి అనుకోవద్దు. మా చంటాడికి పాలడబ్బా అయిపోయింది. అదీ గాక ఇంకాఏవో తేవాలట. దయచేసి ఒక్క ఇరవై రూపాయలు ఉంటే సర్దండి. ఎల్లుండి జీతాలు రాగానే ఇచ్చేస్తాను" అంటూ ప్రాధేయపూర్వకంగా అడిగేడు గుర్నాధం

'చచ్చాంరా దేవుడా! వీడెక్కడ దాపురించాడు నాకు.' అనుకుంటూ జేబులోంచి ఇరవై రూపాయలు తీసిచ్చాడు అప్పారావు. "చాలా థాంక్స్ సార్!" అంటూ వెళ్ళిపోయాడు గుర్నాధం అప్పారావు కదిలే అవసరం లేకుండానే.

'శని విరగడయింది' అనుకుంటూ ఇందిర కోసం మళ్ళా ఆ బెంచిమీదే కూర్చుండిపోయాడు అప్పారావు.

నెమ్మదిగా సమయం గడవసాగింది. ఆరు గంటలయినా ఇందిర జాడలేదు ఎక్కడా. కారణం అర్థం కాలేదు అప్పారావుకి ఎందుకు రాలేదా అని ఆలోచిస్తూ ఇంకో గంట బరువుగా గడిపాడు అప్పారావు.

'ఇక ఇందిర రానట్టే' అనుకుంటూ లేచాడు అప్పారావు. 'ఏమైనా సరే! రేపు ఇందిరను అడగాలి ఎందుకనిరాలేదో' అను

కుంటూ ఏడుపు ముఖంతో ఇంటికి బయలుదేరాడు.

◆ ◆ ◆ ◆

మర్నాడు ఆఫీసుకి వెళ్ళంగానే రామారావు కలిశాడు.

'ఏరా అప్పారావు ఇందిర కలిసిందా?" అంటూ అడిగాడు.

"లేదురా ఇందిర రాగానే ఆడగాలి ఎందుకు రాలేదో" అంటూ సగం ఏడుపుతోనే చెప్పాడు అప్పారావు.

"అవును అప్పారావు! అసలింతకు ఆవుత్తరం ఇందిర రాశిందేనా!" అంటూ అనుమానం వెళ్ళబుచ్చాడు రామారావు.

"ఛ లేదురా! ఇందిర రాశిందే చూడు కావాలంటే" అంటూ వుత్తరం తీసి చూపించాడు అప్పారావు.

ఆ వుత్తరం చదువుతూనే పగలబడినవ్వాడు రామారావు. "ఒరేయ్ అప్పారావు! పప్పులో కాలేశావురా మొత్తానికి" అంటూ నవ్వ సాగాడు రామారావు.

"ఏరా! ఏమయింది" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు అప్పారావు.

"ఈ వుత్తరం నేను రాశిందేరా!" అంటూ మళ్ళీ నవ్వాడు రామారావు.

"ఏరా! వళ్లెలా వుంది" అంటూ విషయం అర్థంగాక కోపంగా అడిగాడు అప్పారావు.

"నాకంటికేం బాగానేవుంది గాని అసలు జరిగిందేమిటంటే ...ఆఁ...ఇంతకి నీకుపార్కులో గుర్నాధం కలిశాడా" అంటూ అడిగాడు రామారావు.

"ఆఁ కలిశాడు అయితే..." అంటూ ఆగిపోయాడు అప్పారావు.

"అప్పడిగాడా? ఎంతిచ్చావు!"

"వాళ్ళబ్బాయికి పాలడబ్బా కొనాలంటే ఇరవై రూపాయలిచ్చాను. ఏం?" విషయం ఆర్థంగాక అడిగాడు అప్పారావు.

"ఏంలేదురా నాలుగు రోజుల కిందట ఓ రోజు గుర్నాధం నన్ను అప్పడిగాడు నేను లేవన్నాను. మొన్న పొద్దున నా దగ్గరకొచ్చి 'గురువుగారు! ఒక మంచి ప్రేమ లేఖ రాశియ్యండి. పేర్లు స్థలము నేను తర్వాత రాసుకుంటాను' అన్నాడు. ఏదో నాకొచ్చినంత వరకు రాశిచ్చాను. కాని గుర్నాధం ఈ పని చేస్తాడని అనుకోలేదురా అప్పారావు! నువ్వేదో ఇందిరకోసం ఎదురు చూస్తూ వుంటావు కాబట్టి ఆ సమయంలో అడిగితే తనని పంపించేయటానికైనా నువ్వు తప్పకుండా ఇస్తావని గుర్నాధం ఈ ఉపాయం పన్నాడన్న మాట. అయితే గుర్నాధం ప్రేమించింది నిన్నన్న మాట" అంటూ మళ్ళీ పగలబడినవ్వాడు రామారావు.

"వోరి గుర్నాధం! ఎంత పనిచేశావురా. రాని వీడి పని చెప్తాను" అంటూ గుర్నాధం కోసం ఎదురు చూడ సాగాడు అప్పారావు!